విద్యుత్ తీగలు కాదు.. యమపాశాలు

- చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- భయాందోళన చెందుతున్న గ్రామీణులు
- పట్టించుకోని అధికారులు


టీడీ పల్లిలో ఇంటిపైనే వెళ్లిన 11 కేవీ విద్యుత్ లైన్

రొళ్ల: విద్యుత్ తీగలు యమపాశాలవుతున్నాయి. మండలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు, పెచ్చులూడిన విద్యుత్ స్తంభాలతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. 1982–86 మధ్య కాలంలో మండలానికి కరెంట్ వచ్చిన సమయంలో విద్యుత్ స్తంభాలు నాటి త్రీఫేస్‌తో పాటు 11 కేవీఏ లైన్ల ద్వారా వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే చాలకాలం కావడంతో స్తంభాలు పెచ్చులూడి అందులో అమర్చిన ఇనుప కడ్డీలు సైతం తేలడంతో పాటు విద్యుత్ తీగలు కూడా వేలాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండలంలోని రొళ్ల, బీజీ హళ్లి, రత్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా నుంచి పది పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు వేలాదిగా వ్యవసాయ బోరు బావులకు చెందిన ట్రాన్స్ ఫార్మర్లకు 11 కేవీఏ విద్యుత్ లైన్లను అధికారులు లాగారు. టీడీ పల్లి గ్రామ సమీపాన ఇందిరమ్మ కాలనీ గుండా వ్యవసాయ పొలాలకు లాగిన 11 కేవీఏ విద్యుత్ లైన్ చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న దుస్థితి కనిపిస్తుంది. ఇటీవల మండల వ్యాప్తంగా లోఓల్టేజీ సమస్యను పరిష్కరించే దిశలో సర్వీసులు ఉన్న ప్రతి బోరు బావి వద్ద హై ఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్) ద్వారా 16, 25 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. పాత విద్యుత్ స్థంభాలు, ఇనుప తీగలు తేలిన వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని రైతులు వాపోయారు. ప్రమాదాలు జరగక ముందే సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకుని పాత విద్యుత్ స్థంభాలను మార్చడంతో పాటు వేలాడుతున్న విద్యుత్ తీగలను మరమత్తు చేయాలని రైతులు, ప్రజలు, కాలనీ వాసులు కోరుతున్నారు. మడకశిర విద్యుత్‌శాఖ ఏడీఈ సుబ్రహ్మణ్యప్రసాద్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా త్వరలోనే వివిధ గ్రామాల్లో పాత విద్యుత్ స్థంభాలతో పాటు కిందకు వేలాడుతున్న తీగలను కూడా మరమత్తులు చేపట్టి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

చేతికి అందే ఎత్తులో తీగలు



పొలాల మీదుగా ఇందిరమ్మ కాలనీ సమీపాన బోరుబావులకు లాగిన 11 కేవీఏ విద్యుత్ లైన్లు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. పొలాల వద్దకు వెళ్లేటప్పుడు ఏమాత్రం అజాగ్రత్త పడిన కూడా తీగలు తలకు తగిలే ప్రమాదం ఉంది. అదే విధంగా ఇందిరమ్మ కాలనీలో గిరిజమ్మ అనే మహిళ ఇంటి పైభాగానే 11 కేవీఏ లైన్ ఉంది. ఇంటి పైకప్పు ఎక్కితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. విద్యుత్ లైన్ల ఎత్తును పెంచాలని తెలియజేసినా పట్టించుకోవడం లేదు.

– రామప్ప, రైతు, టీడీ పల్లి

ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలి



గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన రెండు సింగిల్ ఫేస్ 16 కేవీఏ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మార్చాలి. ఇళ్ల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం వల్ల తరచుగా వైర్లు ఒకదానికి మరొకటి రాసుకుని షార్ట్ సర్క్యూట్ జరుగుతుంటుంది. దీంతో భయాందోళన చెందుతున్నాం. గ్రామం మధ్యలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను మరోచోటకు మార్చాలని అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకుని మరోచోటికి ట్రాన్స్ ఫార్మర్లను మార్చాలి.

– తిమ్మారెడ్డి, రైతు, హెచ్‌టీ హళ్లి

వేసవి తర్వాత నిధులు మంజూరు చేస్తారా?


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: వేసవిలో నీటి ఎద్దడి ఉన్నప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడు పట్టణంలో నీటి ఎద్దడి లేకపోయినా కరువు నిధులంటూ రూ.2.50 కోట్లు వెచ్చించడం ఏమిటి? అవసరం లేకున్నా అద్దె ట్యాంకర్లు ఎందుకు? ఇది నిధుల దుర్వినియోగం తప్ప మారేమి కాదని కౌన్సిలర్లు శివ, అసీఫ్‌వుల్లా నిలదీశారు. శనివారం హిందూపురం మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగింది. కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో కరువు నిధులు కేవలం నీటి సమస్య పరిష్కారానికి వినియోగించాల్సి ఉందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణంలోకి వచ్చే నీటి సరఫరాలో మూడు ప్రాంతాలలో ఎత్తిపోతలతో నీటిని సరఫరా చేస్తున్నామని అందుకు మూడు మోటార్లు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. గొల్లపల్లి నుంచి వచ్చే నీరు ఎప్పుడైనా నిలిచిపోతే అద్దె ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి వీలుగా నిధులు కేటాయింపు చేస్తున్నామని స్పష్టత ఇచ్చారు. వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన రైల్వే రోడ్డు విస్తరణ, రూ.66 కోట్ల నిధులతో చేపట్టాల్సిన అవుటర్ రింగ్ రోడ్డు, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు జరిగేలా చూడాలని సూచించారు. కౌన్సిలర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మార్కెట్ షెడ్ల ప్రక్రియ కౌన్సిల్‌కు చెడ్డ పేరు వచ్చిందన్నారు. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా పాత బస్టాండ్‌లో షెడ్లు వేయించారు. వాటిని తొలగించి నిబంధనల ప్రకారం జరిగేలా పాలకపక్షం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కౌన్సిలర్లు నాసిరాబాను, కౌన్సిలర్ ఇర్షాద్ మహమ్మద్ పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ పాలనలో కౌన్సిల్‌లో నోరువిప్పని టీడీపీ కౌన్సిలర్లు ఇప్పుడు ప్రతి అంశానికి స్పందిస్తూ తామే ఎమ్మెల్యేకు చెప్పి అన్ని చేయిస్తామని సమాధానం ఇవ్వడం కొసమెరుపు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిల్ సభ్యులతో పాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పావగడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సమన్వయ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గౌడ రంగప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట శనివారం చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు నెరవేర్చడంలో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. అలాగే నకిలీ కార్మికులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కార్మికుల పిల్లల విద్యా ధన సహాయం తగ్గించ కూడదని, కార్మికుల సంఘాలతో చర్చించకుండా ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రామాంజినప్ప, వీహెచ్ రామాంజి, మమత, నాగరాజు, కృష్ణమూర్తి, రామకృష్ణ, గిరిరాజు,శాంతరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అమరాపురం: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. శనివారం మండలంలోని మద్దనకుంట, హలుకూరు గ్రామ సచివాలయం– 2ను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వలంటీర్లు లేక పోవడంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వస్తారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సచివాలయం ద్వారా అందించే సేవలను ప్రజలకు తప్పక అందించాలన్నారు. అలాగే ప్రభుత్వం జూలై 1 నుంచి ఇంటింటికీ పింఛన్ కార్యక్రమాన్ని చేపట్టిందని, సచివాలయం ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు


మునాఫ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


మాట్లాడుతున్న భాస్కర్

రొళ్ల: మండలంలోని అలుపనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎంగా పని చేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లు, రత్నగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న పి.ప్రభాకర్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వారనికి పదవీ విరమణ వీడ్కోలు సన్మాన సభను నిర్వహించారు. అలుపనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన సన్మాన సభలో ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తే గౌరవం లభిస్తుందన్నారు. అనంతర ఉద్యోగ విరమణ పొందిన ఎస్.వెంకటేశ్వర్లు, పి.ప్రభాకర్‌ను ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎండీఎం నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం: మండలంలోని చౌళూరు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉర్దూ ఉపాధ్యాయుడు అబ్దుల్ మునాఫ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మునాఫ్ ప్రాథమిక విద్యార్థులకు చక్కగా బోధించారన్నారు. యూటీఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జరీన్‌తాజ్, నరసింహమూర్తి, ఎంఈఓ గంగప్ప, పాఠశాల ఉపాధ్యాయులు గౌస్, అనీష్, మమత, సుజాత, ఇమ్రాన్, హబీబ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలి

మడకశిర: ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఈఓ భాస్కర్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పద్మావతి ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆమెకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పద్మావతి విధి నిర్వహణలో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 నరసింహమూర్తి,హెచ్ఎం మీనాక్షి, విశ్రాంత హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామక్రిష్ణ, లతా రామక్రిష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం ఆదినారాయణ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులు నాక్‌తోపాటు ఉపాధ్యాయులు హెచ్ఎంకు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం


జడ్జి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కేసులను త్వరితగతిన పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కక్షిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని లోక్ అదాలత్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించవచ్చన్నారు. చిన్నపాటి వివాదాలు, తగాదాలకు పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరగడం వల్ల అటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు ఇటు మానసికంగా కూడా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని గుర్తు చేశారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఆదేవిధంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం తరపున న్యాయవాదులను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రెండు బెంచీలను ఏర్పాటు చేసి 118 కేసులను పరిష్కరించారు. ఇందులో 31 ఐపీసీ కేసులు ఉండగా.. ఇసుక అక్రమ రవాణా కేసులు 28, గుట్కా కేసు ఒకటి, 16 అక్రమ మద్యం రవాణా, మూడు చెక్ బౌన్స్ కేసులు, 13 సివిల్ తగాదా కేసులు, ఒకటి భరణం కేసు, ఐదు పి.ఎల్.సి కేసులు, 20 చిన్నపాటి తగాదా కేసులు పరిష్కారం అయ్యాయి. రూ.1,62,915 అపరాధ రుసుము విధించగా, వివిధ కేసుల బాధితులకు రూ.40,88,884 అందజేశారు. పలు కేసులకు సంబంధించి వెంటనే అవార్డు ప్రతులను కక్షిదారులకు అందజేశారు. కాగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో లోక్ అదాలత్ సభ్యులు సంతోషి కుమారి, నవేరా, నరసింహమూర్తి, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 76 కేసుల పరిష్కారం

మడకశిర: మడకశిరలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 76 కేసులను పరిష్కరించారు. రూ.1.92 లక్షలకు ఒక బ్యాంక్ కేసును పరిష్కరించారు. అలాగే 24 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.61 వేలు జరిమానా వసూలు చేశారు. 35 ఎస్టీసీ కేసులను పరిష్కరించి రూ.37,800 జరిమానా విధించారు. అదే విధంగా 15 ఎక్సైజ్ కేసులను పరిష్కరించి రూ.37,965 అపరాధ రుసుం విధించారు. ఒక ఎంసీ కేసును కూడా పరిష్కరించారు. మొత్తం 76 కేసులను రూ.3,28,765 లతో పరిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, పోలీసులు పాల్గొన్నారు.

81 కేసుల పరిష్కారం

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలోన్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాతీయ లోక్ అదాలత్ జరిగింది. అధిక సంఖ్యలో బ్యాంక్ రుణాల బకాయి కేసులు, మున్సిపల్‌కు సంబంధించిన కేసులు లోక్ అదాలత్‌కు వచ్చాయి. న్యాయసేవా అధికార సమితి అధ్యక్షుడు వాసుదేవన్ మాట్లాడుతూ 81 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బుజ్జప్ప, ముజీబ్ ఫసలల్ల సయ్యద్, భాస్కరరెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

టెండర్ల ద్వారా అనుమతులు తీసుకోవాలి

హిందూపురం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిగి బస్టాండ్ ఆవరణలో షెడ్లు వేసినా కూరగాయల మండీ వ్యాపారులు ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి నోటీసులను జారీ చేశారు. దీంతో ఒక్కసారిగా మండీ వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం చైర్ పర్సన్ చాంబర్‌లో చైర్ పర్సన్ ఇంద్రజ, కమిషనర్‌తో మాట్లాడారు. ప్రభుత్వం మారిందని ఇలా చేస్తే.. మేము ఏం కావాలని ఆవేదన వ్యక్తం చేశారు నిబంధనల మేరకు బహిరంగ వేలం పద్ధతిలో స్థలాలు తీసుకుంటే చట్ట ప్రకారం ఎవరికీ అభ్యంతరం లేదని తెలిపారు. బహిరంగ వేలం వేయకుండా స్థలాలు అప్పగించడానికి వీలు లేదన్నారు. గతంలో ఏం జరిగిందో తెలియదని నిబంధన ప్రకారం నడుచుకోవాలని కోరారు. కాస్త గడువు ఇస్తే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చైర్ పర్సన్, కౌన్సిలర్లు తెలిపారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించి వ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతామన్నారు.

పౌరసరఫరాల గోదాము పరిశీలన

మడకశిర: పట్టణంలో శనివారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన పౌరసరఫరాల గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జూలైకి సంబంధించిన సరుకులను ఇంత వరకు నియోజకవర్గంలోని ఎన్ని చౌకధాన్యపు డిపోలకు సరఫరా చేశారని స్టాక్ పాయింట్ అధికారి ద్వారా ఆరా తీశారు. నిత్యావసర సరుకులను అవినీతికి తావులేకుండా పంపిణీ చేయాలన్నారు. సరుకులను చౌకధాన్యపు డిపోలకు జాప్యం లేకుండా చేరవేయాలన్నారు.ఈసందర్భంగా ఆయన వెంట స్థానిక తహసీల్దార్ వెంకటేశ్ ఉన్నారు. కాగా పౌరసరఫరాల శాఖలో పని చేసే కొంతమంది అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ–2 నరసింహమూర్తి సందర్శించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆనంతరం హెచ్ఎంతో విద్యార్థుల హాజరు, డ్రాప్‌అవుట్స్, విద్యాప్రగతి తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ పారదర్శకంగా అమలు చేసేలా చూడాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు నోటీసు

జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలు మేరకు మడకశిర మండలంలోని ఒక ప్రైవేట్ పాఠశాలను రద్దు చేస్తూ శనివారం నోటీసు అందించినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ నింబంధనల ప్రకారం కొన్ని లోపాలున్నాయని నోటీసు ఇచ్చామని తెలిపారు.

బియ్యం, బేడల వితరణ

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదాన సత్రం నిర్వహణకు కర్ణాటకలోని చిక్కబళాపురానికి చెందిన కెఎల్.నారాయణప్ప మిత్ర బృందం శనివారం రూ.40 వేలు విలువ చేసే బియ్యం, బేడలు, బెల్లం తదితర వస్తువులను కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది అన్నదానం కోసం రూ. 6 వేల నగదు అందజేశారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప

గుడిబండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప భరోసా ఇచ్చారు. మండలంలోని ఫళారం గ్రామంలో ఉన్న ఈరలక్కప్ప నివాసంలో అగళి మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అత్యంత పారదర్శకంగా అమలు చేశామన్నారు. ×బటన్ నొక్కి డబ్బులు ఇచ్చారు అన్నారే గాని తిన్నారు₹ అన్న అపవాదు ఎక్కడా మూటగట్టుకోలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మధూడి గ్రామ నాయకులు వెంకటేశ్, సంజీవప్ప, నాగరాజు నరసంబూది తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన


ఆర్వో ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని తాలూకా కార్యాలయం , మున్సిపల్ బస్టాండు, శని మహాత్మ ఆలయం వద్ద ఇన్ఫోసిస్ నిధులతో స్వామి జపానంద ఏర్పాటు చేసిన మూడు ఆర్వో ప్లాంట్లలో నీరు లేక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానిక సమాజ సేవకులు ఆరోపించారు. వారు తాలూకా కార్యాలయంలో నీరు లేక వృథాగా ఉన్న ఆర్వో ప్లాంటు వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతరాయప్ప, నరసింహప్ప, రామకృష్ణ మాట్లాడుతూ సుమారు మూడేళ్ల నుంచి తాలూకా కార్యాలయంలోని ఆర్వో ప్లాంటులో తాగు నీరు లేక తాలూకా కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆర్వో ప్లాంట్ల ద్వారా నీరు అందించి ప్రజల దాహార్తి తీర్చాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సరస్వతి పూజ


మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: మండల పరిధిలోని చలివెందుల ప్రాథమిక పాఠశాలలో శనివారం సరస్వతి పూజను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి వెళ్తున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అలాగే ఒకటో తరగతిలో చేరుతున్న విద్యార్థులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి, ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ పాఠశాల మీద నమ్మకం పెరుగుతుందన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తుందని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ–2 ప్రసన్నలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి, ఉపాధ్యాయులు రామ్మూర్తి, పావని, సీఆర్‌పీ మంజునాథ్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి జ్యోతుల ఉత్సవం


జ్యోతులు తీసుకొచ్చిన మహిళలు

మడకశిరరూరల్: మండలంలోని సింగేపల్లిలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. తొలత మూలవిరాట్‌ను తమలపాకులతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. ఆనంతరం వర్షాలు బాగా కురిసి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జూద కేంద్రంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.7880 నగదుతో పాటు 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడుగురు జూదరులు పరారయ్యారన్నారు.

'వైఎస్సార్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణం'

రొళ్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడం దారుణమని.. ఇలాంటి దురాక్రమణకు పాల్పడం సిగ్గుచేటని తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు శనివారం ఖండించారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లి దళితవాడలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శనివారం నిప్పు పెట్టడం బాధాకరమైన విషయమన్నారు. ఇలాంటి నీచ సంస్కృతి అడ్డుకట్ట వేయాలని వారు డిమాండ్ చేశారు. గత 25 రోజులుగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నా పట్టించుకోకుండా అధికార యంత్రంగం, పోలీసు వ్యవస్థ నిద్రావస్థలో ఉందన్నారు. నీచ సంస్కృతిని వీడి రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి వైపు దృష్టి సారించాలన్నారు.

ఉపాధి పనుల తనిఖీపై గ్రామసభ


మాట్లాడుతున్న డీఆర్పీ ఖాజా

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల తనిఖీ పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ ఖాజా మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ చేపట్టిన పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక బృందం సభ్యులు ఉపాధి పనులు, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పనులు, పింఛన్ తదితర వాటిని పరిశీలించారన్నారు. పనులు, వాటి ఖర్చుల వివరాలను గ్రామ సభలో రైతులు, కూలీలు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, జేఈ జగదీష్, టీఏలు తిరుమలగౌడ, హనుమంతరాయ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామానికి చెందిన మూర్తి (45) రైలు కిందపడి శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మూర్తి గ్రామంలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం క్రితం భార్య మృతిచెందగా, రెండు వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాలు ఉన్నాయి. శనివారం రాత్రి ఇంట్లో గొడవపడి గ్రామ సమీపంలోని రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

పరిగి: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని వక్తలు అన్నారు. శనివారం శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. 6, 7, 8వ తరగతి విద్యార్థులకు దాత ఆదినారాయణప్ప షర్టులను అందించారు. హెచ్ఎం వెంకటేష్ పాల్గొన్నారు.